క్లుప్తంగా

అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ



హోమం చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముఖద్వారం వద్ద ఏర్పాటుచేసిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఆలయానికి ఇరువైపులా హనుమంతుడు, గరుత్మంతుని విగ్రహాలు ఏర్పాటు చేయాలని చేయాలని ఆలయక కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా చింతవరం గ్రామానికి చెందిన దోర్నాదుల సునీల్ శెట్టి అభయ ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. విగ్రహం పనులు పూర్తి కావడంతో తిరుపతికి చెందిన ఆగమ శాస్త్ర పండితులు ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి హోమాలు నిర్వహించారు. అనంతరం దిష్టి తీర్పును పూర్తి చేసి స్వామి వారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దోర్నాదుల మణికుమార్, భరత్‌కుమార్ దంపతులు హోమ ఫలం అందుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీల్లో నాయుడుపేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అన్నమణి

నాయుడుపేట టౌన్ : తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో చెన్నైలో ఆదివారం నిర్వహించిన జాతీయ యోగా పోటీల్లో నాయుడుపేట లోతువానిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిని సోమవారం ప్రధానోపాధ్యాయురాలు అన్నమణి అభినందించారు. యోగా పోటీలు లీగ్ విభాగంలో 10 తరగతి విద్యార్థిని పవిత్ర, కామన్ లీగ్ విభాగంలో 9వ తరగతి విద్యార్థులు షేక్ ఫరీద్, పి.ఖలీఫ్ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ కె.పద్మజ కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు, గుంపెర్ల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో ట్రాఫిక్‌ను నియంత్రించండి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో పెరుగుతున్న జనాభా అనుగుణంగా రోడ్లు లేకపోవడం, ఉన్నరోడ్లు అత్యంత దారుణంగా వుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ నాయకులు తెలిపారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారు సోమవారం సీఐ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో శ్రీసిటీ సెజ్‌లోని పలు కంపెనీల బస్సులు, మాంబట్టు సెజ్‌లోని పలు కంపెనీల బస్సులు, ప్రయివేట్ వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ బస్సులకు రెండు మూడు చోట్ల పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బస్సులు రాత్రివేళల్లో రోడ్ల పక్కన నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయని వివరించారు. ప్రయివేట్ పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అఘాయిత్యాలను అరికట్టాలి

కోట : రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని పొదుపు సంఘాల మహిళలు డిమాండ్ చేశారు. వారు సోమవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సోమవారం జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఇందులో వివిధ శాఖల అధికారులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రాస్ రోడ్డులో మానవ హారం ఏర్పాటుచేశారు. గృహహింస, పిల్లలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీవో వేణు, వెలుగు ఏపీఎం అనీలా పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



మాట్లాడుతున్న హెచ్‌ఎం సుధాకర్

చిల్లకూరు : మండలంలోని చేడిమాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవా రం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ మాట్లాడుతూ ట్రస్టు 8వ వార్షికోత్సవం సందర్భంగా పిల్లలకు చేయూత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు రాజనేని శ్రీనివాసులు అభినందనీయులన్నారు. ట్రస్టు ప్రతినిధులు బాబు, ప్రజేంద్రరెడ్డి, మునిక్రిష్ణ, శ్రీను పాల్గొన్నారు.

సమస్యల గ్రంథాలయాలు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది. అందుకే మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానం అని పెద్దలు చెబుతారు. అందరికీ పుస్తకాలు కొనుగోలు చేసుకుని చదువుకునే అవకాశం ఉండదు. ఈ క్రమంలో ప్రభుత్వాలు గ్రంథాలయాలను ఏర్పాటుచేసింది. వాటిలో పుస్తకాలతోపాటు విలువైన గ్రంథాలు, దినపత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాయి. గూడూరు నియోజకవర్గంలోని పలు గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పుస్తకాలు ఉన్నచోట భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. భవనాలు బాగున్నచోట పుస్తకాలు ఉండడం లేదు. దీనికితోడు సిబ్బంది లేరు. గ్రంథాలయాల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిఏటా నవంబర్ 14న నెహ్రూ జయంతి సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పలుచోట్ల గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించలేదు.



చిట్టమూరులోని గ్రంథాలయంలోని దుస్థితి



వాకాడు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తకాల ఎగ్జిబిషన్ (ఫైల్)

- కరువైన వసతులు
- నిరుపయోగంగా భవనాలు
- నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- తూతూమంత్రంగా వారోత్సవాలు

చిల్లకూరు : గూడూరు మున్సిపాల్టిలో సుమారు 1.25 లక్షల మంది జనాభా ఉంది. వీరికి ఒకే ఒక చోట జిల్లా గ్రంథాలయం ఉంది. అది కూడా పట్టణ నడి బొడ్డులో ఉన్న సీవీసీ పార్కులో ఏర్పాటు చేశారు. ఇక్కడ పుస్తకాలు కొత్తవి వచ్చిన దాఖలాలు లేవు. ఇక్కడ గ్రేడ్-1 లైబ్రేరియన్ ఉండాల్సి ఉంది. కొంత కాలంగా పోస్టు ఖాళీగా ఉండడంతో రికార్డు అసిస్టెంటు పనులు చూసుకుంటున్నారు. గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించలేదు. ప్రతి ఏటా ప్రజల నుంచి గ్రంథాలయ పన్ను వసూలు చేసే మున్సిపాలిటీ అధికారులు గ్రంథాలయం గురించి పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు.

- చిల్లకూరు మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. మండల కేంద్రమైన చిల్లకూరులో మాత్రమే గ్రంథాలయం ఉంది. భవనం ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. 30 ఏళ్ల క్రితం జాతీయ రహదారి విస్తరణలో ఈ భవనంలో కొంత భాగాన్ని తొలగించారు. అందుకు పరిహారం ఇచ్చినప్పటికీ అది గ్రంథాలయ సంస్థకు చేరలేదు. ఆ నిధులు ఏమయ్యాయనే విషయం మరుగున పడిపోయింది. ఇక్కడ లైబ్రేరియన్ ఉన్నప్పటికీ కొత్త పుస్తకాలు మాత్రం కనిపించవు. మండలంలో సుమారు 20 వేల గహాలు ఉండగా వాటికి ప్రతి ఏటా పన్ను వసూలు చేస్తున్నారు.
- కోట పట్టణంలో కూడా బస్టాండ్‌కు దగ్గరగా గ్రంథాలయం ఉంది. పాఠకులకు అనువుగా ఉన్నప్పటికీ కొత్త పుస్తకాలు లేవు. చిల్లకూరులో పని చేసే లైబ్రేరియన్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ స్వీపర్‌గా పని చేసే మహిళ లైబ్రేరియన్ పాత్ర పోషిస్తున్నారు. మండలంలో ప్రతి ఏటా గ్రంథాలయం పన్ను వసూలు చేస్తున్నా వసతులు మాత్రం కల్పించడం లేదు.
- చిట్టమూరులోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. లోపల ఉన్న ఫర్నిచర్ మొత్తం ధ్వంసమైంది. తలుపులు కూడా తెరుచుకున్న దాఖలాలు లేవు. ఎవరినైనా గ్రంథాలయం గురించి అడిగితే లేదన్న మాట వినిపిస్తోంది. మండలంలో పంచాయతీ కార్యదర్శులు వసూలు చేసిన ఇంటి పన్ను నుంచి గ్రంథాలయాలనికి ఇవ్వాల్సిన నిధులు చెల్లించకపోవడంతో ఇక్కడ కూడా గ్రంథాలయ వారోత్సవాలకు మంగళం పాడారు.
- వాకాడులోని గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ కనీసం కూర్చోవడానికి అవసరమైన ఫర్నిచర్ కూడా లేదు. మండలంలో ఇంటి పన్నుతో పాటు గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్నా ఫలితం లేదు. వసతుల గురించి పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు చెబుతున్నారు.



గూడూరులోని గ్రంథాలయం



చిల్లకూరులో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయ భవనం



వాకాడులోని గ్రంథాలయం పరిస్థితి



స్వీపర్ నిర్వహిస్తున్న కోట గ్రంథాలయం

వేలూరుకు పరామర్శ



వేలూరు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వివిధ పార్టీల నాయకులు

పెళ్లకూరు: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డిని సోమవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించారు. మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్ధన్‌రెడ్డి(90) సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు డాక్టర్ సునీల్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, పేరం రమేష్‌నాయుడు, బాలాజీ, మస్తాన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు వేలూరు నివాసానికి చేరుకొని జనార్ధన్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరిబాబురెడ్డి, శ్యామ్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్త్రీ హింస నివారణ దినోత్సవం


సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్త్రీ హింస నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలోని మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో స్త్రీహింస నివారణ దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ విక్టోరియారాణి మాట్లాడుతూ ప్రతిరోజూ దేశంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒక్కరు వేధింపులకు గురవుతున్నారని, అందుకే విద్యార్థినులు జాగ్రత్తగా వుండాలని సూచించారు. మహిళల మీద దాడులను అరికట్టేందుకు కఠినమైన శిక్షలు అమలుచేయాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జంతుశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ జంతు సంక్షేమ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు డి.ఉషారాణి, ఎం.అమ్మాజీ, ఈ.సునీత, డాక్టర్ సల్మా, ఎస్ యామిని తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన భోజనం పెట్టడం లేదు'

– తహసీల్దార్‌కు బీసీ హాస్టల్ విద్యార్థుల ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట కాలనీలో ఉన్న బీసీ కాలేజీ వసతి గృహంలో నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. వారు సోమవారం తహసీల్దార్ రాజేంద్రకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని తుమ్మూరు పాత చెక్ పోస్టు వద్ద అద్దె భవనంలో హాస్టల్ నిర్వహించేవారని తెలిపారు. నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో యజమానులు హాస్టల్ భవనానికి తాళం వేశారని తెలిపారు. నెల క్రితం లోతువానిగుంట కాలనీలో ఉన్న బీసీ హాస్టల్‌లోకి మార్చారని వివరించారు. వార్డెన్, వంట మనిషి, సర్వెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమకు సక్రమంగా భోజనం పెట్టడం లేదని వాపోయారు. ఉదయం టిఫిన్ పెట్టిన తర్వాత 7 గంటలకే భోజనాన్ని క్యారేజీలో పెట్టి ఇస్తున్నారని, అది మధ్యాహ్నానికి పాచిపోతోందని తెలిపారు. ఈ విషయాన్ని చెప్పినా కుక్, సర్వెంట్లు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వార్డెన్‌ను నిలదీసినందుకు ముగ్గురు విద్యార్థులను ఇళ్లకు పంపించేశారని ఆరోపించారు.


నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : చిల్లకూరుకు చెందిన వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు నందవరం సుబ్బారావు కుమార్తె లహరి, కడపకు చెందిన అఖిల్‌కుమార్ వివాహం సోమవారం గూడూరు పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

భూ ఆక్రమణపై గ్రామ సేవకుల ఆందోళన



భూమి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ సేవకులు

గూడూరు రూరల్ : ప్రభుత్వం తమకు మంజూరు చేసిన భూమిని కొంతమంది ఆక్రమించుకుంటున్నారని గ్రామ సేవకులు ఆరోపించారు. వారు సోమవారం సంబంధిత భూమి వద్ద ఆందోళన చేపట్టారు. గూడూరులో పనిచేసే 20 మంది గ్రామ సేవకులకు 1990లో ప్రభుత్వం గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం సమీపంలో 13 ఎకరాల భూమిని కేటాయించింది. వారు అప్పటి నుంచి అందులో సాగు చేసుకుంటున్నారు. ఇటీవల పోటుపాళెం గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు ఆ భూమి తమకు పెద్దల ద్వారా సంక్రమించదని చెబుతూ సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై గ్రామసేవకులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ క్రమంలో తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవకుల సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొళ్లపూడి సుబ్బయ్య, సంజీవయ్య, పిండి బాబు, రాజయ్య, సుబ్రమణ్యం, రఘు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

చిల్లకూరు : మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్ల పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గోపి హెచ్చరించారు. ఆయన సోమవారం నెలబల్లిరెట్టపల్లి, బూదనం గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్నిగ్రామాలలో ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ పేరు తో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. పీఆర్ ఏఈ ఇలియాజ్, ఉపాధి ఏపీవో గిరి పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

ఓజిలి: గ్రామస్థాయిలో ఇంటి జియోట్యాగింగ్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశించారు. ఆమె సోమవారం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులు వివరాలు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే తప్పనిసరిగా సర్వేలో నమోదు కావాలని తెలిపారు. స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులను సత్వరం పరిష్కరించాలన్నారు. సుపరింటెండెంట్ ప్రసన్న, ఈవోపీఆర్డీ రేణుక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన, ఏపీఎం పద్మమ్మ, ఏపీవో ఉషారాణి, హౌసింగ్ ఏఈ భార్గవ్, సిబ్బంది రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు అనుమతి లేదు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడానికి అనుమతి లేదని, భక్తులు దర్శనానికి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్ తీసుకురావద్దని ఈవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. క్యూలైన్‌కు అనుసంధానంగా ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఫోన్లను వాటిలో ఉంచి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత ఫోన్లను తీసుకోవచ్చని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలయంలోకి సెల్‌ఫోన్లను అనుమతి ఇవ్వబోమని పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు

కోట : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐటీడీఏ ద్వారా ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వేణు సోమవారం తెలిపారు. ఆధార్ కార్డులు లేని వారికి కొత్త కార్డులు మంజూరు చేస్తామని, ఆధార్‌లో తప్పుల సవరణలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలంలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు ఆధార్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు.

భూసమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న మనవాలి గ్రామస్తులు

ఓజిలి: మనవాలి గ్రామంలో భూసమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్లు 1, 9, 11, 114, 99లలో 100 ఎకరాల చెరువు భూములు ఆక్రమణలకు గురైనట్టు తెలిపారు. నాలుగు రోజుల క్రితం వీఆర్వో గ్రామంలో పర్యటించి సర్వేనంబర్ 114లోని భూముల్లో బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. సుమారుగా వంద ఎకరాలు ఆక్రమణలకు గురైతే తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో 114 సర్వే నంబర్‌లో బోర్డులు పెట్టామన్నారు. మిగిలిన ఆక్రమణపైనా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని ఆర్‌ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వో డిల్లెయ్యను ఆదేశించారు. మాజీ మండల కన్వీనర్ దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అరవభూమి రాజారెడ్డి, కటకం పొందయ్య, కాటంరెడ్డి వేణురెడ్డి, పరంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న జంటలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని శ్రీదక్షిణామూర్తి ఆలయం వద్ద కార్తీక మాసం చివరి సోమవారం శ్రీసత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. గుండాల బత్తుల రామసుబ్రమణ్యశర్మ, పి.సాయి ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి కల్యాణంతో పాటు 120 జంటలకు కల్యాణం జరిపించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఒగ్గు కృష్ణయ్య ఆధ్వర్యంలో 2వేల మందికి అన్నదానం చేశారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

సైదాపురం : అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆయన సోమవారం సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతోందన్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సుబ్బరామరాజు, మురారి, కృష్ణయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి, జంబుకేశ్వర స్వామి ఆలయాల వద్ద కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. తిమ్మాజికండ్రిగ సమీపంలోని దుర్గామల్లేశ్వరి దేవి ఆలయం, పుదూరులోని హనుమదీశ్వర స్వామి ఆలయం, జువ్వలపాళెం, తుమ్మూరులోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



సైదాపురం: సిద్ధలయ్య కోనలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సైదాపురం : సిద్ధలయ్యను దర్శించుకునేందుకు వెళుతున్న భక్తులు

సిద్ధలయ్యకోనలో పోటెత్తిన భక్తులు

సైదాపురం: సైదాపురం సమీపంలో ఉన్న సిద్ధలయ్య కోనకు కార్తీక మాసం చివరి సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రీనవకోటి, నవనాథుల సిద్ధలయ్యతో పాటు వారి ప్రియశిష్యుడు సారంగధరుడిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. మహిళలు దీపాలు వెలిగించారు. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఒగ్గు కృష్ణయ్య ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నదానం చేశారు. ఎస్‌ఐ క్రాంతికుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

దక్కిలిలో : మండలంలోని దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. మహిళలు ఉసిరి చెట్టు కింద, ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. పలువురు పొంగళ్లు పెట్టారు. రాత్రి శివ పార్వతుల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. దగ్గవోలులో ఉన్న నాగలింగేశ్వరస్వామి, వడ్ల మోపూరు శివాలయం, మార్లగుంట, ఆల్తూరుపాడు, వెలికల్లు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

రాపూరులో..

రాపూరు: కార్తీక మాసం చివరి సోమవారం రాపూరులోని రామనాథేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చన, పూలంగి సేవ చేపట్టారు. భక్తులు తెల్లవారు జామునే నదీ స్నానం ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే పెంచలకోన సమీపంలోని బైరాగికోనలో రుద్ర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రామనందస్వామి, శ్రీహరిరెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాపూరు రామనాథేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దక్కిలి: స్తంభాలగిరీశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నాయుడుపేట టౌన్ : దీపాలను వెలిగిస్తున్న భక్తులు